పవర్ లిఫ్టింగ్ పోటీలకు వెంకటరత్నం ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్‌లో పవర్ లిఫ్టింగ్ శిక్షణ పొందుతున్న అమలాపురం బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి బిహెచ్.వెంకటరత్నం 83 కేజీల విభాగంలో ఇటీవల విజయవాడలో జరిగిన బిఎస్ఎన్ఎల్ ఎపి సర్కిల్ సెలక్షన్ ట్రైల్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. నవంబర్లో 11 నుంచి 13వ తేదీ వరకు గౌహతిలో జరిగే 20వ ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎపి సర్కిల్ నుంచి ఎంపికైనట్టు చీఫ్ జనరల్ మేనేజర్ వద్ద నుంచి సెలెక్షన్ ఆర్డర్‌ను అందుకున్నందుకు సోమవారం జిమ్‌లో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎనుముల కృష్ణ పద్మరాజు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మట్టపర్తి సముద్రం, కోచ్ వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు ముత్తాబత్తుల వెంకటరమణ, పద్మావతి, కృష్ణ, సుమంత్, మణికంఠ అభినందించారు.

సంపద కేంద్రాలు నిరుపయోగం

- కానరాని డంపింగ్ యార్డ్‌లు
- వ్యర్థాల నిర్వహణలో చిత్తశుద్ధి కరువు

రూ.కోట్లు ఖర్చు చేసి ప్రతి పంచాయతీలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల ప్రారంభానికి ముందే అవి శిథిలావస్థకు చేరాయి. సిబ్బందికి నెల నెలా జీతాలు చెల్లించినా వాటి ఫలాలు ప్రజలకు చేరడం లేదు. ఎక్కడ చూసినా మురుగు కాలువలు, వీధుల్లో చెత్త, ప్లాస్టిక్, గాజుసీసాలు పేరుకుపోతున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు.

ప్రజాశక్తి-రాజోలు

గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తిష్ట వేశాయి. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. దీంతో దుర్వాసన వ్యాపించి, దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను గ్రామాలకు దూరంగా తరలించడంలో సంబంధిత అధికారులు పూర్తి స్థాయి శ్రద్ధ చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో చెత్త సమస్యను పరిష్కరించేందుకు గతంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రారంభించారు. మరలా ఇటీవల గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి కార్యక్రమం 15 రోజుల పాటు నిర్వహించారు. కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యారు తప్ప వాటి నిర్వహణ క్షేత్ర స్థాయిలో జరగడం లేదు. అయితే తడి, పొడి చెత్తను వేరు చేసి ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాలకు తరలించే పనులు ఆశించిన విధంగా జరగడం లేదు.

నియోజకవర్గంలో ఇలా..!

రాజోలు నియోజకవర్గంలోని 4 మండలాల్లో 59 గ్రామాలు ఉన్నాయి. నియోజకవర్గంలోని రాజోలులో 12, మలికిపురంలో 15, సఖినేటిపల్లిలో 14, మామిడికుదురులో 16



తాటిపాకలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో ప్రతి మండలంలో కేవలం నాలుగైదు తప్ప మిగతా కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడా డంపింగ్ యార్డులు కానరావడం లేదు. ఈ నేపథ్యంలో వీధుల్లో, రహదారుల పక్కన చెత్తాచెదారాలు పేరుకుపోతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. మరికొన్ని చోట్ల పేరుకుపోయిన చెత్తను అక్కడే కాల్చేస్తుండటంతో కాలుష్యం ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో డంపింగ్ యార్డుల ఏర్పాటుకు గతంలో నిధులు కేటాయించినా అవి కార్యరూపం దాల్చలేదు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లోని ప్రధాన గ్రామాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రాజోలులో నిల్వ ఉన్న చెత్తను స్థానికులు ఎదురుగానున్న ప్రధాన పంట కాలువలో వేస్తున్నారు. మలికిపురం మండలం రామరాజులంకలో వశిష్ఠ నదీ తీరంలో చెత్తను పారేస్తున్నారు. దీంతో జలాలు కూడా కలుషితమవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి, గ్రామాల్లోని పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎంపిడిఒ టి.వెంకటాచార్యను వివరణ కోరగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చెత్త కాల్చడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

అలంకార ప్రాయంగా సంపద కేంద్రాలు

ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన చెత్త సంపద తయారీ కేంద్రాల్లో ఒక్క కేంద్రం నుంచి ఎరువు తయారు చేసిన దాఖలాలు లేవు. గృహాల నుంచి రోజువారీ విడుదలయ్యే చెత్తను ఆ కేంద్రాలకు తరలించేందుకు ప్రభుత్వం పంచాయతీలకు రిక్షాలను అందజేసింది. చెత్తను వేసేందుకు ప్రతి ఇంటికీ రెండు చొప్పున డబ్బాలు పంపిణీ చేసింది. గతంలో చెత్తను సేకరించిన హరిత రాయబారులు చెత్త ఎక్కడ వేయాలో తెలియక రోడ్ల వెంబడే పడవేసి వెళుతున్నారు. అన్ని గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్తను, వ్యర్థ పదార్థాలను పడవేస్తుండటంతో గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొంది. ప్రభుత్వ నిధులతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు వృథాగా పడి ఉండటంతో అధికారుల తీరును ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. అధికారులు మాత్రం వీటిని వినియోగంలోకి తీసుకురావాలంటే ఖర్చుతో కూడుకున్న పని అని చేతులెత్తేస్తున్నారు. చెత్త తీసుకెళ్లే రిక్షాలు వాడకపోవటంతో తుప్పుబట్టి పోతున్నా పట్టించుకోవటం లేదు. ప్రభుత్వం స్పందించి అలంకారప్రాయంగా ఉన్న చెత్తసంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకరావాలని, తుప్పు పడుతున్న చెత్తతోలు రిక్షాలు వినియోగంలోకి తీసుకొచ్చి గ్రామాల్లో అపరిశుభ్రతలేకుండా చర్యలు చేపట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి ప్రచారం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మండలంలో పలు గ్రామాల్లోని జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి సోమవారం ప్రచారం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పర్యటించారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి బలపరచాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు విద్యా సమస్యలపై ఉపాధ్యాయులకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రతి సమస్యపై స్పందించి శాసనమండలిలో తన గళాన్ని వినిపిస్తానని గోపి మూర్తి ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సమస్యలు విద్యా సమస్యలపై ఉపాధ్యాయులతో వారు చర్చించారు. వారి వెంట



ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి

యూటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు అత్తిలి సురేష్ కుమార్, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ గుత్తుల సుబ్రహ్మణ్యం, కామన మధుసూదన రావు, ఎస్.చంటిబాబు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



బస్ సర్వీసులు ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

విశాఖ-ఇచ్ఛాపురం బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం ఆర్‌టిసి బస్టాండ్ నుంచి ఇచ్ఛాపురం వయా విశాఖపట్నం వెళ్లే 3 ఆర్‌టిసి బస్సులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం రామచంద్రపురం నుంచి ఇచ్ఛాపురం వరకు మూడు 40 సీట్లు గల బస్సులను ప్రారంభించామన్నారు. ఈ బస్సులు ఉదయం, సాయంత్రం వేళలో రామచంద్రపురం నుంచి బయలుదేరుతాయని తెలిపారు. రామచంద్రపురం నుంచి భద్రాచలం ఆర్‌టిసి బస్సులు నడపాలని ప్రజల నుంచి అర్జీలు వస్తున్నాయని ఈ విషయాన్ని ఆర్‌టిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్సు సర్వీసును ఏర్పాటు చేసే విధంగా చర్యలుతీసుకుంటామన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి రామచంద్రపురం వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు రాత్రి సమయాల్లో బస్సులు, ఆటోలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో అతి త్వరలో వివిఎస్‌ఎం కాలేజీ నుంచి చుట్టుపక్కల గ్రామాలకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. రాబోయే రోజుల్లో సుదూర ప్రాంతాలకు మరిన్ని బస్సు సర్వీసులు నడిపే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిపిటిఒ శ్రీనివాసరావు, డిఎం భాస్కర్, విజిలెన్స్ అధికారి రామారావు, ఎంఎంఎఫ్ రవిబాబు, రామచంద్రపురం డిపో సిబ్బంది పాల్గొన్నారు.

రైతు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజోలు

జిల్లాలో కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం పెట్టుబడి సహాయం రూ.20 వేలు ఇవ్వాలని, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు అన్నారు. సోమవారం కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారు ఎన్ఎస్ఎస్.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇది రైతులకు, వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడుతుందని, కౌలు రైతులు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని చెప్పారు. మూడు నెలలవుతున్నా ఇప్పటికీ పెట్టుబడి సహాయం లేదన్నారు. రైతులు మదుపులు పెట్టి ప్రైవేటు వ్యక్తి దగ్గర అప్పులు తెచ్చి, వాటిని తీర్చడానికి బ్యాంకుల చుట్టూ రుణాల కోసం తిరుగుతున్నా లాభం లేదన్నారు. కావున ఇప్పటికే రైతులు మద్దతు ధర చాలక వ్యవసాయం లాభసాటి కాక చాలా మంది వ్యవసాయానికి దూరం అవుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఒక్కొక్క రైతుకు రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు 2011 కౌలుదారీ చట్ట ప్రకారం కార్డు ఇచ్చి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రైతుసంఘం ఉపాధ్యక్షుడు టి.ఉదయ భాస్కర్, తాడి శ్రీరామ్మూర్తి, కె.శ్రీనురెడ్డి, వై.శ్రీరాములు, జి.వెంకటరమణ, ఎ.రాజశేఖర్ పాల్గొన్నారు.



రమణయ్యకు నివాళలర్పిస్తున్న నాయకులు

బివి.రమణయ్యకు పలువురి ఘన నివాళి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం బివి.రమణయ్య కాలనీలో ఆయన వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. జల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఐఎన్.మల్లేశ్వరరావు మాట్లాడారు. రమణయ్య ఎంఎల్ఏగా ఉన్న రోజుల్లో మేనేజమెంట్ వసతి గృహాలుగా ఉన్న వాటిని ప్రభుత్వ వసతి గృహాలుగా మార్చేందుకు 13 గంటలు అసెంబ్లీలో తన వాణి వినిపించి విజయం సాధించారని కొనియాడారు. బిఎస్‌ఐ జిల్లా అధ్యక్షులు రామ్ బోధి కాశి మాట్లాడారు. ఈ సభలో, పరమట శ్రీనివాసరావు, దండి రాజశేఖర్, పరమట రామ్‌ప్రసాద్, కాశి వెంకటరావు, ములపర్తి సత్యనారాయణ, పొత్తుల నాగరాజు, పెయ్యల పరశురాముడు, మెండు డేవిడ్, కోరుకొండ వెంకటేష్, జొన్నాడ చిరంజీవి, కారెం వెంకటేశ్వరరావు, ఇసుకపట్ల దుర్గాప్రసాద్, పరమట రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో గోదావరి భవన్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, పింఛన్ల మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, ఆక్రమణల తొలగింపు, వంటి అంశాలపై 276 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిష్కరించిన అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

అధికారులను ఆదేశించారు. గడువు దాటిన అర్జీలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మధుసూదన రావు, ఐసిపిఎస్ పీడీ ఎం.ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి

పోలీసుల త్యాగాలు మరువలేనివని పలువురు కొనియాడారు. సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం రాజ్యాంగ రక్షణ, సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ విధి నిర్వ హణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువ లేమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎర్ర వంతెన వద్ద నున్న పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బందికి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వంలో ఎన్నోశాఖలు ఉన్నప్పటికీ పోలీస్ శాఖ విధులు భిన్నంగా ఉండి 24 గంటలు విధినిర్వహణలో పోలీసులు సమాజంలో ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారని తెలిపారు. పోలీసు అమరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఈ నెల 21న ప్రారంభమయ్యే సంస్మరణ కార్యక్రమాలు 31న జరిగే జాతీయ ఐక్యతా దినోత్సవం రోజున ముగుస్తాయని తెలి పారు. 26, 27 తేదీల్లో అన్ని జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. తొలుత నూతనంగా నిర్మించిన అమర్ జవాన్ స్థూపాన్ని ఎస్‌పి వి.కృష్ణారావుతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, అదనపు జిల్లా జడ్జి నరేష్ పాల్గొన్నారు.



అమలాపురంలో నివాళులు అర్పిస్తున్న ఎంపీ, కలెక్టర్, ఎస్‌పి



ఆలమూరులో..

ముమ్మిడివరంలో సిఐ ఎం.మోహన్ కుమార్ ఆధ్వర్యాన పోలీస్ స్టేషన్ సెంటర్ నుండి హైస్కూల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ జ్వాలా సాగర్, వివిధ పాఠశాలల విద్యార్థులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరులో సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్‌ఐ ఎం.అశోక్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్ రోడ్ మీదుగా ర్యాలీ సాగగా ఎఎస్‌ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రామచంద్రపురం ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ వద్ద అమరవీరులకు ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. కె.గంగవరం పోలీస్ స్టేషన్ వద్ద, రామచంద్రపురం పోలీస్ స్టేషన్ వద్ద అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

కాట్రేనికోన మండలంలోని విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం పోలీసు స్టేషను వద్దనుండి కాట్రేనికోన గేటు సెంటరు వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ అవినాష్ మాట్లాడారు.

వంద పడకల ఆసుపత్రిగా సిహెచ్‌సి

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వంద పడకల ఏరియా ఆసుపత్రిగా చేపట్టిన పనులకు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ సోమవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రి అవసరం ఎంతో ఉందన్నారు. సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలానే లక్ష్యంతో తాను ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టానని అన్నారు. ఎన్‌సిసి సహకారంతో ఆసుపత్రి అదనపు భవనం నిర్మించి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసేందుకు కంకణం కట్టుకున్నానని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణం ఎత్తు చేసి పార్క్ నిర్మాణం కూడా చేపడతామన్నారు. రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు సరైన వైద్యం అందడం లేదని ఎంఎల్ఎ ఆవేదన వ్యక్తం చేశారు. రాజోలు నియోజకవర్గ ప్రాంతం కోనసీమ జిల్లాకు చిట్టచివరన ఉండటం వల్ల విద్య, వైద్య రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. నేటికీ రాజోలు పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్ఎంపి, పిఎంపీ వైద్యులపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. ఆసుపత్రిలో పని చేసేందుకు వైద్యులు ఆసక్తి చూపడం లేదన్నారు. ఇద్దరు గైనకాలజిస్టులు అవసరం ఉన్న ఆసుపత్రిలో ఒక్కరూ కూడా అందుబాటులో లేకపోవడం బాధాకరం అన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

గైనకాలజిస్టుతో పాటు ఖాళీగా ఉన్న చిన్నపిల్లల డాక్టర్ పోస్టును భర్తీ చేయమని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి రుద్రరాజు పద్మరాజు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, ముదునూరి చినబాబు, గుండుబోగుల పెదకాపు, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, ఎంపిపి కేతా శ్రీనివాస్, వైస్ ఎంపిపిలు ఇంటిపల్లి ఆనందరాజు, పొలమూరి శ్యామ్‌బాబు, కూటమి నాయకులు సూరిశెట్టి శ్రీను, అడబాల సాయిబాబు, గుబ్బల శ్రీను, చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి, దారపురెడ్డి బాబ్జి, బొమ్మిడి మహేష్, షేక్ ఇస్మాయిల్, మోకా పార్వతి, జక్కంపూడి శ్రీదేవి పాల్గొన్నారు.

ఒకే సచివాలయం ఉండాలని వినతి

ప్రజాశక్తి-అమలాపురం

సర్పంచుల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక గ్రామంలో ఒకే సచివాలయం ఉండాలని, సచివాలయ ఉద్యోగులు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పని చేయాలని కోరామన్నారు. ఒక గ్రామంలో సచివాలయాలు ఎక్కువగా ఉండటంతో ఉద్యోగులకు పని ఉండడం లేదని, వారు ఎవరి ఆదేశాలతో పని చేయాలన్న దానిపై సందిగ్ధత ఉందని తెలిపారు. తమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సర్పంచుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు నాగబత్తుల శాంతకుమారి, అడబాల తాతకాపు, పెద్దిరెడ్డి రామచంద్రరావు, కరాటం ప్రసన్న, పెనుమాల సునీత, జాలెం రమణకుమారి, జె.సావిత్రి, గంగుమళ్ల ఏసుబాబు, సలాది బుచ్చిరాజు, పందిరి విజయ, గుత్తుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై దృష్టి

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జలవనరులు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుండి 22 మండలాల తహశీల్దార్లు, ఆర్‌డిఒలు, జల వనరుల శాఖ ఇంజనీర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో సెంట్రల్ డెల్టా, తూర్పు డెల్టా, ఆయకట్టు కింద ప్రాదేశిక డిస్ట్రిబ్యూటరీ సంఘాలు నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని, దీనికి సంబంధించి ప్రాదేశిక నియోజకవర్గం వారీగా సర్వే నెంబర్లను అనుసరించి రైతులు వివరాల ఎన్నికల జాబితా సిద్ధం చేయాలన్నారు. జాబితా తయారీలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత జల వనరుల శాఖ ఇంజనీర్ల ద్వారా నివృత్తి చేసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మండల స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన గడువు లోపు జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు



అధికారులతో మాట్లాడుతున్న జెసి టి.నిషాంతి

కృషి చేయాలని సూచించారు. ప్రతిపాదిత జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి ఏవైనా మార్పులు ఉంటే కలెక్టరేట్‌లోని కోఆర్డినేషన్ సెక్షన్ ద్వారా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఎఒ కె.కాశీ విశ్వేశ్వర రావు, జలవనుల శాఖ ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి ప్రజలకు వరం

రాజోలు : సిఎం సహాయనిధి పేద ప్రజల పాలిట వరమని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం మలికిపురంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 22 మంది బాధిత కుటుంబాలకు వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.17 లక్షలను బాధిత కుటుంబ సభ్యులకు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్‌స్థాయిలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తోందని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనారోగ్యానికి గురైన ప్రతి పేదవాడికీ ఆర్థిక సాయం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, నాయకులు గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, పినిశెట్టి బుజ్జి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు ఎర్ర పోతవరంలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -రామచంద్రపురం


కె.గంగవరం మండలంలోని ఎర్ర పోతవరం గ్రామంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామని నిర్వాహకులు కోలా నాగేశ్వరరావు తెలిపారు. కపిలేశ్వరపురం ఎల్వి ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరం ఎర్ర పోతవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒక గంట వరకు జరుగుతుందని తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారంతా వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు చేయించుకుని మందులు తీసుకువెళ్లాలని, ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా లెన్స్ ఏర్పాటు చేసి ఆపరేషన్ చేస్తారని తెలిపారు.

నేడు అమలాపురం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి-అమలాపురం

వికాస, టెక్ లాజిక్, ది అమలాపురం డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని యువత వినియోగించుకోవాలని సూచించారు. సుమారు 17 కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్ మేళాలో పాల్గొంటారని తెలిపారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మరణం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం రైల్వే స్టేషన్‌లో ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారంలో గుర్తు తెలియని వ్యక్తి సోమవారం అనారోగ్యంతో మరణించాడు. అతడి మృతదేహాన్ని తుని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిస్తే తుని రైల్వే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

దాడిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఉపాధి కోసం మురుగు కాలవ పక్కన ప్రభుత్వ భూమిలో బడ్డీ కొట్టు పెట్టుకుంటే, గ్రామానికి చెందిన కొంతమంది ఆ బడ్డీని తొలగించడమే కాక అడ్డుకున్నందుకు తన పైన, తన మనవడిపైనా దాడి చేసి గాయపరిచారని బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని సోమిదేవర పాలెనికి చెందిన వస్త్రాల సుబ్రమణ్యం బడ్డీ ఏర్పాటు చేసుకోగా సోమవారం గ్రామానికి చెందిన కొంతమంది తాను ఏర్పాటు చేసిన బడ్డీని తాడు కట్టి ట్రాక్టర్‌తో బయటకు లాగేశారని, అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు తన పైన మనవడు అతికల గణేష్‌పైన దాడి గాయపరిచారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సారా విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలం లోని రాజవరం గ్రామ శివారు నాటు సారాను స్వాధీనం చేసుకుని గ్రామానికి చెందిన కోట రామకృష్ణను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. కొత్తపేట కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఫ్లయ్ ఓవర్ పనులపై ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - ఆలమూరు

216 ఎ జాతీయ రహదారిపై మండలంలోని జొన్నాడ వద్ద నిర్మిస్తున్న ఫ్లయ్‌ఓవర్ పనుల జాప్యంపై కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సోమవారం హైవే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రయాణికుల విజ్ఞప్తుల, ఫిర్యాదుల మేరకు హైవే అధికారులతో కూలంకషంగా చర్చించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల జాప్యం జరగడానికి గల ప్రధానమైన కారణాలపై నిలదీశారు. దీనిపై హైవే అధికారులు మాట్లాడుతూ 2025 మార్చి 31 నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా పర్యవేక్షణ లోపం లేకుండా ఫ్లయ్‌ఓవర్ పనులు త్వరితగతిన పూర్తిచేసి, ప్రయాణికులకు సౌకర్యవంతమైన రహదారి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆకుల రామకృష్ణ, హైవే పిడి రాజేంద్రనాథ్, ప్రాజెక్ట్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, జొన్నాడ సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ తాడి శ్రీనివాస్ రెడ్డి, ఎఎంసి మాజీ ఉపాధ్యక్షులు గోడవర్తి బాబీ, కూటమి నాయకులు నాగిరెడ్డి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట మండలం పలివెలలోని కోట మెరకలో ఆంజనేయ స్వామి ఆలయ పునప్రతిష్ట ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాదే లక్ష్మీ శ్రీనివాస్, నల్లా రమణ, మోకా రామ్మోహనరావు, కరెడ్ల మురళి, గొలకోటి శ్రీనివాస్, మోకా సత్తిబాబు పాల్గొన్నారు.

బివి.లంకలో ఉపాధి పనుల గుర్తింపు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని బడుగువానిలంక గ్రామపంచాయతీ వద్ద ఉపాధి హామీ పథకం 2025-2026 ఆర్థిక ఏడాదికి 51 పనులకు ఆమోదంతో పాటుగా చేయవలసి పనులపై గ్రామ సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి సంబంధించిన 10 అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ప్రకాష్, కూటమి నాయకులు పాలూరి గోవిందరాజు, దూలం రాంబాబు, పడాల అమ్మిరాజు, కార్యదర్శి ఎం.విజయరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మందపల్లి సూరిబాబు పాల్గొన్నారు.



వర్షపు నీటిలోనే ఉన్న పేదల ఇళ్లు

వర్షపు నీటిలోనే పేదల ఇళ్లు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పేదల ఇళులు ముంపు బారిన పడ్డాయి. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక కాశి వాని తూము సెంటర్‌లో సరైన డ్రైనేజీ సౌకర్యం లేక వర్షపు నిలిచి పోవడంతో పలు ఇళ్లు నీట మునిగాయి. ఇప్పటికైనా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి ముంపు నీరు దిగే విధంగా చర్యలు తీసుకుని, రాబోవు కాలంలో ముంపు సమస్య తలెత్తకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని కోరారు.

పంట కాలువలో వ్యర్థాలు తొలగించాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్.కొత్తపల్లి ప్రధాన పంట కాలువలో వ్యర్థాల తూడును తొలగించాలని జనసేన పార్టీ నాయకుడు కడియం సందీప్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం ప్రజా స్పందన కార్యక్రమంలో ఉపాధి ఎపిఒ వి.రాజామణికి వినతిపత్రం అందించారు. పంట కాలువ దుస్థితిని వివరించారు. సుమారు 6 కిలోమీటర్ల మేర ఈ పంట కాలువను అనుకుని ఉన్న నివాస గృహాలు ప్రజలకు వాడుకునేందుకు వంటకాలువ నీరే ఆధారం అన్నారు. వంటకాలువలో ఇష్టానుసారంగా వ్యర్థాలను పడవేయడంతో పాటు గుర్రపుడెక్క, తూడు దట్టంగా పెరిగి కాలువ నీరు ప్రజల అవసరాలకు ఉపయోగకరంగా లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో కె.రంగబాబు, రాంబాబు తదితరులు ఉన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం




ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచులు వెంకటేశ్వరరావు

ఉద్యోగులు తమ విధి నిర్వహణలో అంకిత భావంతో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని పలువురు ప్రశంసించారు. నంగవరం సచివాలయంలో సోమవారం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నంగవరం, సన్నవిల్లి గ్రామాలలో పనిచేసి బదిలీ అయిన ఉద్యోగులను సత్కరించారు. బదిలీపై అయినవిల్లి మండలం వెలవలపల్లి వెళ్లిన పంచాయతీ కార్యదర్శి వీధి సత్యనారాయణ, కొత్తపేట మండలం పలివెల బదిలీపై వెళ్లిన సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ గౌస్ మొహిద్దీన్ ఖాన్ గొల్లవిల్లి బదిలీపై వెళ్లిన విద్యుత్ శాఖ జెఎల్ ఎంఎస్.విజయ్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సన్నవిల్లి సర్పంచ్ చిక్కం పెదబాబు, ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజ కుమారి, పంచాయతీ వార్డు సభ్యులు కామిరెడ్డి నారాయణరావు, బుడితి వెంకటరావు, మాజీ సర్పంచులు శీలం సూరిబాబు, చేటకాయల సూర్యవతి, మాజీ ఉప సర్పంచ్ లంక సత్యనారాయణ గ్రామ పెద్దలు గుర్లింక చిన్న, ఆకుల వెంకటేశ్వరరావు, గుర్లింక వెంకటేశ్వరరావు, రాయపురెడ్డి నాగు, గుంట్రు సత్యనారాయణ, విఆర్ఒ పి.బాలాజీరావు పాల్గొన్నారు.

లక్ష్మణమూర్తి జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం



లక్ష్మణ మూర్తికి నివాళులర్పిస్తున్న నాయకులు

తెలంగాణ సాయుధ పోరాటంలో వీరమరణం పొందిన అంగర గ్రామానికి చెందిన తోరాటి లక్ష్మణమూర్తి జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. సోమవారం మండలంలోని అంగర తోరాటి లక్ష్మణ మూర్తి విజ్ఞాన కేంద్రం వద్ద ఆయన 72వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. పలువురు లక్ష్మణ మూర్తి చిత్రపటానికి స్మారక స్థూపానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ లక్ష్మణమూర్తి తెలంగాణకు వెళ్లి 1951లో వికారాబాద్‌లో రైతులతో మాట్లాడుతుండగా కాల్పుల్లో వీర మరణం పొందారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యానాల సుబ్బారావు, పసలపూడి కృష్ణ, ప్రసాద్, ముత్తా చిన్న, యానాల వీర రాఘవులు, సుంకర సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నగర వాసులు సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ముమ్మిడివరం నగర పంచాయతీ ఇన్ ఛార్జ్ కమిషనర్ కె.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో మొబైల్ ఆధార్ క్యాంపులలో భాగంగా కొత్త ఆధార్ కార్డు లు, ఆధార్ కార్డులో మార్పులు తదితర విషయాలకు సంబంధించి మంగళవారం నుండి 25 తేదీ వరకు ఈ మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. వీటిలో భాగంగా 22న గొల్లల వీధి, పోలమ్మ చెరువు సచివాలయాలకు సంబంధించి ముమ్మిడివరం జెడ్పి బాలుర హైస్కూల్లోనూ, రాజుపాలెం, పల్లిపాలెం సచివాలయాలకు సంబంధించి 23న జెడ్పి బాలికల హైస్కూల్లోనూ, బొండాయి కోడు తూము, రాయుడువారిపాలెం సచివాలయాలకు సంబంధించి 24న ముమ్మిడివరం మున్సిపల్ కార్యాలయం వద్ద, సూరాయి చెరువు సచివాలయానికి సంబంధించి 25న సూరాయి చెరువు సచివాలయంలో ఈ ఆధార్ క్యాంపులో ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

హైవేను పరిశీలించిన ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం మీదుగా గోపాలపురం వరకు గల జాతీయ రహదారిని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సోమవారం హైవే అధికారులతో కలిసి పరిశీలించారు. రావులపాలెం నుండి ఈతకోట టోల్ గేట్ వరకు రహదారిని పరిశీలించి రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా చేపట్టిన సర్వీస్ రోడ్డుకు ఆటంకాలు లేకుండా రోడ్డును పూర్తి చేయాలని సూచించారు. బస్టాండ్ వద్ద డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. అరటి మార్కెట్ కొద్దిపాటి చిన్నపాటి వర్షానికే జలమయం అవుతోందని సమస్యను పరిష్కరించేందుకు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని హైవే అధికారులను ఆదేశించారు. తరచూ వివాదాలకు నెలవుగా మారిన టోల్ గేట్ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేసారు. ప్రతీ టోల్ గేట్ వద్ద ప్రోటోకాల్ వాహనాలకు ప్రత్యేక మార్గం ఉన్నట్టే ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ సూచించారు. రావులపాలెం అరటి మార్కెట్ వద్ద చిరు వ్యాపారులను ఇబ్బందులు పెడుతున్నారని తమ గోడును విన్నవించుకుంటున్న బాధితులపై హైవే సిబ్బంది దురుసుగా మాట్లాడటంతో ఎంఎల్ఎ కలుగజేసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు ప్రజా సేవకులని వారి సమస్యను పరిష్కరించాలే తప్ప వారిపై దురుసుగా ప్రవర్తించడం తగదని హెచ్చరించారు. ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, గుత్తుల పట్టాభి రామారావు, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, కాసా విజయ సాగర్, మైగాపుల గురవయ్య నాయుడు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-అమలాపురం



సిఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న వేణు

ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదల వల్ల బాధితులకు స్థానిక సర్ సివి రామన్ పాఠశాల రూ.లక్ష విరాళం అందించింది. ఈ చెక్కును సర్ సివి రామన్ పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రతి ఒక్కరూ సహదయంతో స్పందించి తమ వంతు సహాయం అందించడం కనీస సామాజిక బాధ్యత అన్నారు. అటువంటి సామాజిక స్పృహను సర్ సివి రామన్ పాఠశాల ఎప్పటినుంచో పాటిస్తోందని ప్రశంసించారు. సివి రామన్ పాఠశాల డైరెక్టర్ వేణుగోపాల్ రావును ఆయన అభినందించారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గురుకుల పాఠశాల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని ఎంపి హరీష్ బాలయోగికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ కోరింది. మండలంలోని ఠానేలంక పంచాయతీ పరిధిలోని గురుకుల పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థినులు వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కమిటీ చైర్మన్ నల్లా వీర వెంకట సత్యనారాయణ ఎంపీ హరీష్ మాదుర్ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోయి విష సర్పాల భయంతో విద్యార్థినిలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారాని, పాఠశాల ప్రాంగణాన్ని మేరకు చేసి, క్రీడా ప్రాంగణం అబివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రహరీ గోడను ఆనుకుని ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ప్రహరీ గోడ ఎత్తు పెంచాలని, విద్యార్థినులకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఆర్ఒ ప్లాంట్ అందుబాటులోకి తీసుకు రావాలని, ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ వడ్డి శ్యామ్ ప్రసాద్, దాకే సత్తిబాబు, బీర అన్నవరం, ఎంవి.సూర్యం, సిహెచ్.సుధీర్, లంక వర ప్రసాద్, పినిపే దివ్య భారతి, ఎన్.హైమావతి పాల్గొన్నారు.



గుంతలను చదును చేయిస్తున్న నాయకులు

మండపేట రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక ప్రధాన రహదారి అయిన ఆర్ అండ్ బి రోడ్డుకు ఏర్పడిన భారీ గుంతలకు సోమవారం తాత్కాలిక మరమ్మతులు చేశారు. జొన్నాడ-మండపేట ఆర్ అండ్ బి రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను వ్యాపారవేత్త వంటిపల్లి కాశీ విశ్వనాథం సౌజన్యంతో సోమవారం జెసిబి ఏర్పాటు చేసి, భారీగోతులను చదును చేసి, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో జరుగుతున్న పనులను స్థానిక ఎఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్ల బాబు పర్యవేక్షించారు.

జొన్నాడ ఇసుక ర్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ ఇసుక ర్యాంపును సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ తాడి శ్రీనివాస్‌రెడ్డి, ఎఎంసి మాజీ ఉపాధ్యక్షుడు గొడవర్తి బాబి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మండల పరిధిలోని గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకునే వారు ట్రాక్టర్లతో ఉచితంగా ఇసుకను తీసుకుని వెళ్ళవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



శేష వాహనంపై విహరిస్తున్న శ్రీ శ్రీనివాసుడు

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. పండితులు కండబల్లి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి స్వామివారికి పలు పూజలు చేశారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు దంపతులు, మండల అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు దంపతులు, లొల్ల గ్రామ సర్పంచ్ కాయలు జగన్నాథం, ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు వేల సంఖ్యలో యాత్రికులు రావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. వచ్చిన యాత్రికులకు ఇబ్బందులు ఎత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.



ఆలమూరులో గ్రామసభ

రెవెన్యూ సమస్యలపై గ్రామసభలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం, ఆలమూరు

రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కపిలేశ్వరపురం తహశీల్దారు పి.చిన్నారావు అన్నారు. సోమవారం మండలంలోని వల్లూరు గ్రామపంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ దాసి మీనా కుమారి ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎపి రీ సర్వే ప్రాజెక్టులో సర్వే పూర్తయిన గ్రామాల్లో వివిధ భూ సమస్యలపై రైతులతో గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. వల్లూరి వీరబాబు, గుణ్ణం సుబ్బరాజు, కార్యదర్శి కె.సత్తిబాబు, విఆర్ఒలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు రైతులు తమ భూ సమస్యలపై గ్రామ రెవెన్యూ సభలను తప్పక వినియోగించుకోవాలని తహశీల్దారు కెజె.ప్రకాష్ బాబు అన్నారు. మండలంలోని గుమ్మిలేరు పంచాయతీ వద్ద రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. సుమారు 30 మంది రైతులు తమ భూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. గత ప్రభుత్వంలో జరిగిన సమగ్ర భూ సర్వే అంతా అవకతవకలతో కూడుకుఇ పూర్తి స్థాయిలో తప్పులతో నమోదులు అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అముజూరి శ్రీను, డిప్యూటీ సర్వే ప్రభాకర్ రావు, ఆర్ఐ రామాయమ్మ, మండల సర్వేయర్ ప్రభావతి, కార్యదర్శి పద్మావతి, పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు గుర్తించి పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-రామచంద్రపురం



మాట్లాడుతున్న మంత్రి సుభాష్

గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కె.గంగవరం మండలంలోని పాతకోట కోటిపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ మన ఊరు మన సుభాష్ అనే కార్యక్రమం ప్రజలకు మరింత చేరువయ్యేలా స్థానిక నాయకులు పని చేయడం, గ్రామ స్థాయి సమస్యలను గుర్తించడం, పరిష్కారం చూపడం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. స్థానిక సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతకోట, కోటిపల్లి గ్రామపెద్దలు రామచంద్రపురం నియోజవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ కూటమి నాయకులు సంఖ్యలో పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయానలి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు డిమాండ్ చేశారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో సోమవారం పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క పెన్షన్ తప్ప మిగతా హామీలన్నీ హామీలుగానే ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్ష పాత్రను కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని తెలిపారు. ఎంఎల్ఎలు, ఎంపీలు ఉన్నా వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను విమర్శించడం లేదన్నారు. ప్రజల తరపున కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందన్నారు. అనంతరం అమలాపురం ఆర్‌టిసి బస్టాండ్ వద్దకు వెళ్లి పల్లె వెలుగు బస్సులో ఉన్న మహిళలతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు పోస్టుకార్డులు రాయించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్, అమలాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ అయితాబత్తుల సుభాషిణి, పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, ముషిణి రామకృష్ణ, కుడుపూడి శ్రీనివాస్, యార్లగడ్డ రవీంద్ర, గెడ్డం సురేష్ బాబు, మాచవరపు శివన్నారాయణ, దేవరపల్లి రాజేంద్ర బాబు, షకీలా, రాయుడు వెంకటరమణ, సాధనాల చిన సత్యనారాయణ, రెడ్డి బాబు, సత్తి సత్తిబాబు, జోగి అర్జునరావు, పులుసుగంటి ప్రకాష్, మొల్లేటి వెంకటేశ్వరరావు, ఏలేశ్వరం రాధాకృష్ణ, రొక్కాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని బాలాదిత్య స్కూలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని బట్లపాలిక గ్రామంలోని బాలాదిత్య స్కూలుకు ఎటువంటి అనుమతులూ లేవని దీంతో ఆ స్కూలు మూసివేశామని మండల విద్యాశాఖ అధికారి అలజంగి నాగరాజు సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఆ స్కూల్లో విద్యార్థులను చేర్పించితే దానికి ఎవరూ బాధ్యత వహించారని ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి ఆ అనుమతులు లేని స్కూల్లో పిల్లలను చేర్పించవద్దని ఆయన విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

ఐదు వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-కొత్తపేట

దేవీ నవరాత్రులను పురస్కరించుకుని అవిడి గ్రామంలో ఐదువేల మందికి సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల నలుమూల నుంచీ వచ్చిన యాత్రిలకు అసౌకర్యం కలగకుండా వంటకాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కవి సుబ్బారావుకు ఘన సత్కారం

కొత్తపేట : కొత్తపేటకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ వివివిఎస్. సుబ్బారావును శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన సోమవారం ఘనంగా సత్కరించారు. తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో 30 గంటల 30 నిమిషాల 30 సెకన్ల పాటు ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు పాల్గొని 'పండుటాకుల వ్యధ' పద్య కవితా గానాన్ని వినిపించారు. 'సత్య హరిశ్చంద్ర' నాటకం నుంచి వారణాశి సీన్‌లో హరిశ్చంద్రుని ఏకపాత్రాభినయం చేశారు.

PUBLIC NOTICE

Under instructions from my client **Smt. RAPA SATYA SUGANDHI,** W/o. Dakkumalla Immanuel Issak Raju, R/o. Pithapuram it is to inform that previously, my client compelled to borrow on amount of Rs. 50,000/- from 3rd parties to provide treatment to her father during Covid 19 Pandemic. At that juncture, they have taken empty promissory notes and cheques of State Bank of India, Pithapuram Branch and Karur Vysya Bank, Pithapuram belong to her. Subsequently, she cleared the same but due to innocence, failed to obtain those documents. Taking Advantage of the same, in order to gain illegally, unknown persons in collusion with custodian of my client's documents, started issuing notices by making false claims. My client has already issued suitable reply to persons who had issued false notices and taking legal recourse against them. However, any claims against my client basing on promissory notes and cheques belong to her does not bind on my client as they were never supported with any consideration.

S.MURTUJA
Kakinada Advocate, Kakinada
Dt: 20-10-2024 Cell: 9652538888

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు Mohammed Mohussain Sharief, S/o.Sardar Faizur Rahaman, వెంకటరత్నపురం, కాకినాడ నివాసి, ఇచ్చిన వివరణ ప్రకారం ది.10-10-2024వ తేదీన ఉదయం సుమారు 11 గంటల సమయంలో నా క్లయింటు వారి ఇంటి నుండి పెద్ద మసీదుకు మోటారు సైకిల్‌పై వెళ్ళుచున్న సమయంలో ఆయన బండికి తగిలించిన చేతి సంచి మార్గ మధ్యలో ఎక్కడో జారి పోయినది. ఆ సంచిలో వారి యొక్క తండ్రి గారు అయిన Sardar Faizur Rahaman గారికి చెందిన డోరు నెం.28-2-4, ఆజాం వీధి, కాకినాడ యొక్క ఇంటి ఒరిజినల్ దస్తావేజు నెం.1917/1974 మరియు ఇతర కాగితాలు వున్నవి. వాటి గురించి ఆయన ఎంత వెదికినా దొరకలేదని తెలియ జేసినారు. ఆ ఒరిజినల్ దస్తావేజులు వారికి ముఖ్యమై వున్నందున ఇది ఎవరికైనా దొరికిన యడల ఈ క్రింది అడ్రసుకు అందజేయవలసినదిగా కోరుచున్నాను.

విడియాల శివప్రసాద్, అడ్వకేట్
మెయిన్‌రోడ్, రాయుడుపాలెం,
కాకినాడ రూరల్ మండలం.
కాకినాడ
తేది:21-10-2024 సెల్: 99487 51642

పాస్‌పోర్టు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వసంతవాడ గ్రామానికి చెందిన కాయల సూర్యారావు, తండ్రి: బాలయోగి అను నేను ది. 18-10-2024 సం॥రం తేదీన నా పాస్‌పోర్టును నెం. **J 6385190** తీసుకుని వసంతవాడ సెంటరు వద్ద జిరాక్సు తీయించుకుని తిరిగి ఇంటికి వెళ్ళుచున్న సమయంలో నా పాస్‌పోర్టు ఒరిజినల్ ఎక్కడో పడిపోయినది. నా పాస్‌పోర్టు కొరకు చుట్టుప్రక్కల అంతా వెతికిన దొరకలేదు. దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు ఇవ్వగలరు.

కాయల సూర్యారావు
తండ్రి: బాలయోగి, వసంతవాడ గ్రామం
ఆత్రేయపురం మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 84998 46841

కోర్టు సమను

మహారాజశ్రీ గౌరవ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P. No. 90/2023

Between:
శీలం శ్రీనివాసరావు, తండ్రి: నాగేశ్వరరావు, వయసు 42 సం॥రాలు, హిందూ, టైలర్, డోర్ నెం. 1-4/3, అంగర గ్రామం, కపిలేశ్వరపురం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా. *-పిటీషనర్ (వాది)*
అండ్
శీలం భవాని @ టేకుమూడి భవాని *-రెస్పాండెంట్ (ప్రతివాది)*

టు:
శీలం భవాని @ టేకుమూడి భవాని, భర్త: శీలం శ్రీనివాసరావు, వయసు 37 సం॥లు, గృహిణి, ముచ్చేరువు గ్రామం, రామచంద్రపురం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. -ప్రతివాది

నా క్లయింట్ శీలం శ్రీనివాసరావు గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మహారాజశ్రీ గౌరవ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో అతను వాదిగా మీపై విడాకులకు HMOP No. 90/2023 రు దావా/ వ్యాజ్యం దాఖలు చేసియున్నారు. సదరు వ్యాజ్యంలో కోర్టు వారు పైన వివరించిన చిరునామాకు అనేక పర్యాయములు పోస్టు ద్వారాను, కోర్టు ద్వారాను సమన్లు పంపించినప్పటికి మీరు ఉద్దేశ్యపూర్వకంగా కోర్టు సమన్లు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు.

కావున మీరు వారు ది. **07-11-2024 సం॥రం ఉదయం గం॥ 10.30 ని॥లకు** సదరు పైన వివరించిన కోర్టు నందు మీరు స్వయంగా గాని లేదా మీ లాయరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని యెడల కోర్టు వారు మీ పరోక్షమున వ్యాజ్యం తీర్మానించెదరు.

(గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

జుత్తుగ నాగేశ్వరరావు
రామచంద్రపురం వాది తరపు అడ్వకేటు
తేది:21-10-2024 సెల్:8074054030

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

E.P. No. 48/2019
O.S. No. 97/2016
E.A. No. 76/2023

Between:
కోనాల వెంకటరెడ్డి మరియు
డోకుబుర్ర సత్యం వగైరాలు

టు:
డోకుబుర్ర సత్యం, వగైరాలు

1. డోకుబుర్ర సత్యం, S/o. సారంగదరుడు, వ్యాపారం, వయసు 58 సంవత్సరాలు, బలభద్రపురం పరిధి, బిక్కవోలు మండలం.
2. ఉండ్రాసు సత్యవతి, W/o. అప్పారావు, వయసు 60 సంవత్సరాలు, ఏడిద, ఆలమూరు కోర్టు పరిధి, మండపేట మండలం.
3. కటకం వీరమ్మ, W/o. చిన్నోడు, వయసు 57 సంవత్సరాలు, సింగంపల్లి, పెద్దాపురం కోర్టు పరిధి, రంగంపేట మండలం.

నోటీసు

పై నెంబర్ కేసులో 1వ మరియు 3వ రెస్పాండెంట్లకు తెలియజేయునది ఏమనగా పై నెంబర్ కేసులో,

ఉత్తరం సరిహద్దు 12 గజములు లేదా 10.973 మీటర్లు డోకుబుర్ర పుత్రయ్య గారి స్థలం బదులుగా 8 చదరపు గజములు లేదా 7.315 మీటర్లు పంచాయతి వీధి షెడ్యూల్ ఆస్తిలో అని చదువుకోవాల్సిందిగా అదేవిధంగా,

దక్షిణం సరిహద్దు 8 చదరపు గజములు లేదా 7.315 మీటర్లు పంచాయతి వీధి బదులుగా 12 చదరపు గజములు లేదా 10.973 చదరపు మీటర్లు డోకుబుర్ర పుత్రయ్య గారి ఖాళీ స్థలం షెడ్యూల్ ఆస్తిలో అని చదువుకొనవలెను. దానిపై పై నెంబరు కేసులో దాఖలు చేసిన సవరణ పిటిషన్‌పై ఏవిధమైన అభ్యంతరాలు ఉన్నా ది. **6-11-2024 సంవత్సరం తేదీన ఉదయం గం॥ 10.30 నిమిషాలకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ముందు హాజరై అభ్యంతరములు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

కె.వి.సుబ్బారెడ్డి
అనపర్తి డిహెచ్ఆర్ తరపు అడ్వకేట్
10-10-2024 సెల్: 9949035905

పురపాలక సంఘ కార్యాలయం, రామచంద్రాపురం

Roc.No. 658/2022-A1 **Dt: 21-10-2024**

బహిరంగ వేలం నోటీసు

రామచంద్రాపురం పురపాలక సంఘమునకు చెందిన ఈ క్రింది తెలిపిన షాపు రూములు గెజిట్ నెం. 247, తేది: 29-04-2017 నిబంధనల మేరకు G.O.Ms.No. 56, తేది: 05-02-2011 కౌన్సిల్ తీర్మానం నెం.3, తేది: 29-04-2017 లను అనుసరించి స్వాధీనపరచిన కాలము నుండి 3 సంవత్సరములు కాలమునకు లీజుకు ఇచ్చుటకు తేది. 29-10-2024, మంగళవారం ఉదయం గం॥ 11.00 లకు పురపాలక సంఘ కార్యాలయము నందు కమిషనరు వారిచే గాని, వారి అనుమతి పొందిన వేరొక అధికారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును. సదరు వేలం నందు పాల్గొనదలచిన వారి ప్రథమ ధరావత్తు మరియు వేల్యూషన్ ధృవపత్రము ఈ క్రింది తెలిపిన విధముగా చెల్లించి వేలం నందు పాల్గొనవచ్చును.

వ.నెం.	షాపింగ్ కాంప్లెక్స్	వేలం నిర్వహించు షాపులు	ప్రథమ ధరావత్తు	వేల్యూషన్ అమౌంట్
1	మార్కెట్ ఏరియా	7, 8, 9, 11, 12, 13	30,000/-	1,00,000/-
2	ఆంధ్ర కేసరి	3, 6, 10, 11, 21	30,000/-	1,00,000/-
3	శ్రీ నందివాడ	6	30,000/-	1,00,000/-
4	పాత బస్ స్టాండ్	3 (ST), 4, 5, 6, 8, 9, 13, 14, 15, 16, 17, 21, 22, 23, 24, 25, 28, 31	30,000/-	1,00,000/-

నోట్: 3 సంవత్సరముల బ్యాంక్ గ్యారంటీ ధృవపత్రం ఆక్షన్ తేదీకి 3 రోజులు ముందుగా సమర్పించవలెను.

బహిరంగ వేలంలో పాల్గొన పాటదారులు రూ. 1,00,000/- వేల్యూషన్ సర్టిఫికెట్ సమర్పించవలెను. మరియు బహిరంగ వేలంలో పాల్గొన పాటదారులు రూ. 30,000/-లు డిపాజిట్ చెల్లించవలెను. మరియు చెల్లించిన ప్రథమ ధరావత్తు సొమ్ము తిరిగి చెల్లించబడును. సదరు షాపుల బహిరంగ వేలం నందు కమిషనరు వారిచే తుది నిర్ణయం.

ఏ కారణం చేతనైన గుత్త రద్దుపరచిన యెడల గుత్త కాలము మధ్యలో గుత్త ఖాళీ చేసి గుత్త నష్టపరచినచో ఆ గుత్తుదారునికి బాధ్యతపై వేలం వేయబడును. అట్టి వేలం వేయుట వలన మున్సిపాలిటీ వారికి వచ్చే నష్టం గుత్తుదారుని నుండి వసూలు చేయబడును. అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ నిమిత్తం పాటలో పాల్గొనప్పుడు ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ డిపాజిట్ రూపంలో చెల్లించవలెను. ఇందు విషయమై పూర్తి వివరము కొరకు ఆఫీసు పని వేళల నందు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మరియు A1 గుమస్తా వారిని సంప్రదించగలరు.

సం/- **కమిషనరు**
రామచంద్రాపురం పురపాలక సంఘం